సంక్రాంతి నాటికి శ్రీరాంపురం చెరువుకు గోదావరి జలాలు!

డిసెంబరులోగా నాగుపల్లి సీతారామ కాలువ పనులు పూర్తి చేయాలి

చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్‌రెడ్డికి మంత్రి తుమ్మల ఆదేశం



దమ్మపేట, నవంబర్ 20(ప్రజాజ్యోతి): సాగునీటి కోసం ఎదురుచూస్తున్న దమ్మపేట మండల రైతులకు గోదావరి జలాలతో భరోసా కల్పించే దిశగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చర్యలు చేపట్టారు. నాగుపల్లి సీతారామ కాలువ పనులను వేగవంతం చేసి వచ్చే సంక్రాంతి నాటికి శ్రీరాంపురం చెరువులోకి గోదావరి జలాలు చేరేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు. **మిగతా 2లో...**



21 శనివారం నవంబర్ 2026 | నవంబర్ | 2026 • పేజీలు : 8



వేటగాళ్లు, స్మగ్లర్లకు అడ్డాగా ములకలపల్లి అడవులు!

ఐదు రేంజ్‌లు ఉన్నా.. కొరవడిన నిఘా

అధికారుల అలసత్వంతో యథేచ్ఛగా వన్యప్రాణుల వేట, కలప అక్రమ రవాణా

ములకలపల్లి, నవంబర్ 20 (ప్రజాజ్యోతి): అడవులు, వన్యప్రాణుల సంరక్షణకు ప్రభుత్వాలు ఎన్ని చర్యలు చేపడుతున్నా క్షేత్రస్థాయి అధికారుల నిర్లక్ష్యంతో అవి ఆచరణకు నోచుకోవడం లేదనే విమర్శలు





వినిపిస్తున్నాయి. ములకలపల్లి మండల పరిధిలోని విస్తారమైన అటవీ ప్రాంతాలు వేటగాళ్లు, కలప స్మగ్లర్లకు అడ్డాగా మారుతున్నాయనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మండలంలోని అటవీ ప్రాంతాలు దమ్మపేట, **మిగతా 2లో...**

ఓ వ్యాపారి 3 దందాలు



ఓ వ్యాపారి గిన్నెల దందా.. ప్యాకేజీ దందా.. భూ దందా..!

- మూడు దందాలు.. ఒకే సూత్రధారి..!

- ఒక చేత్తో గిన్నెలు.. మరో చేత్తో ప్యాకేజీలు.. కాళ్ల కింద వేల ఎకరాలు..!
- సర్వేలో 50 ఫేక్ పేర్లు.. బినామీలతో వేల ఎకరాలు..!
- ఏజెన్సీని తన గుప్పిట్లో పెట్టుకున్న ఓ గిన్నెల వ్యాపారి..!

“ గిన్నెల కొట్టుతో మొదలైన వ్యాపారం.. ఇప్పుడు ఏజెన్సీని గుప్పిట్లో పెట్టుకున్న మూడు దందాల సామ్రాజ్యంగా మారిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక పక్క గిన్నెల దందా.. మరో పక్క సింగరేణి ఓసీ సర్వేలో బినామీ పేర్లతో ప్యాకేజీల దందా.. ఇంకో పక్క ప్రభుత్వ.. అసైన్డ్.. ఫారెస్ట్ భూములను కబ్జా చేసిన భూ దందా.. ఈ మూడింటితో కోట్లు సంపాదించాడని తెలుస్తోంది. ఓసీ విస్తరణ సర్వేలో ఏకంగా 50 ఫేక్ పేర్లను నమోదు చేయించాడని ఆరోపణలు జోరుగా వెల్లువెత్తుతున్నాయి. ఏజెన్సీలో గిరిజనేతరుడై ఉండి.. ఇన్ని వేల ఎకరాలు.. ఇన్ని కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ వ్యాపారిపై వెంటనే విచారణ జరిపి.. కబ్జా చేసి బినామీల చేతుల్లో ఉన్న భూములను స్వాధీనం చేసుకోవాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. ”

మిగతా 2లో...



శ్రీ కోదండ రామస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన

పాల్గొన్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

పాల్వంచ లో ఫుట్‌పాత్ ఆక్రమణ


నిబంధనలు నిల్లు, వ్యాపారం ఫుల్లు

టెంపరరీ ట్రేడ్ లైసెన్స్ పేరుతో రూ.4 వేల వసూళ్లు, అనుమతులపై అనుమానాలు

ఎంఆర్‌పీ ట్యాగులు లేకుండానే యథేచ్ఛగా విక్రయాలు

స్వెటర్ రూ.2 వేల నుంచి రూ.4 వేల వరకు, దుప్పటి రూ.1,500 నుంచి రూ.5 వేల వరకు ధరలు

ఫుట్‌పాత్ ఆక్రమణతో జాతీయ రహదారిపై ట్రాఫిక్ ఇబ్బందులు



మొదటిపేజీ తరువాయి

ఓ వ్యాపారి గిన్నెల దందా.. ప్యాకేజీ దందా.. భూ దందా..!

- మూడు దందాలు.. ఒకే సూత్రధారి..!

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి /

మణుగూరు, నవంబర్ 20, ప్రజాజ్యోతి...

ఏజెన్సీ గడ్డపై పుట్టి పెరిగిన గిరిజనుడికి సెంటు భూమి దక్కడం లేదు.. కానీ అదే గడ్డపై బయటి నుంచి వచ్చిన ఓ గిన్నెల వ్యాపారి మాత్రం వేల ఎకరాలకు అధిపతి అయ్యాడు. గిన్నెల కొట్టు ముసుగులో మొదలైన దందా.. సింగరేణి ప్యాకేజీలు.. భూ కబ్జాల వరకు ఎలా విస్తరించిందో తెలిస్తే అధికారులే నోరెళ్లబెట్టాల్సిందే. బినామీల పేర్లతో సర్వేలో పేర్లు నమోదు చేయించి.. ప్రభుత్వ.. ఫారెస్ట్ భూములను తన గుప్పిట్లో పెట్టుకున్న తీరుపై మణుగూరు అంతటా చర్చ నడుస్తోంది. ఈ దందా వెనుక ఎవరి అండ ఉందో.. కోట్ల ఆస్తులు ఎలా వచ్చాయో తేల్చాలని గిరిజనులు నిలదీస్తున్నారు.

గిన్నెల దందా.. ప్యాకేజీ దందా.. భూ దందా..!

మణుగూరులో ఓ గిన్నెల వ్యాపారి చుట్టూ మూడు వేరు వేరు ఆరోపణలు తీవ్రంగా తిరుగుతున్నాయి. మొదటిది గిన్నెల విక్రయంలో అక్రమాలు జరిగాయన్న వాదన.. రెండవది సింగరేణి ఓసీ సర్వేలో బినామీల ద్వారా ప్యాకేజీలు పొందబోతున్నారన్న ఫిర్యాదు.. మూడవది ప్రభుత్వ, అసైన్డ్, అటవీ స్థలాలను ఆక్రమించారన్న అభియోగం సంచలనం రేపుతోంది. ఈ మూడింటిపై గిరిజన సంఘాలు స్వతంత్ర దర్యాప్తు కోరుతున్నాయి. సంబంధిత శాఖలు రికార్డులు పరిశీలించి నిజనిజాలు బయటపెట్టాలని సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

మూడు దందాలకు.. ఒకే సూత్రధారి..!

ఏజెన్సీ ప్రాంతంలో జరుగుతున్న వేరు వేరు అక్రమాల వెనుక ఓ గిన్నెల వ్యాపారి హస్తం ఉందని అనుమానం వ్యక్తం అవుతోంది. గిన్నెల వ్యాపారం పేరుతో మొదలైన పరిచయాలు.. క్రమంగా సర్వే పనుల్లో జోక్యం వరకు వెళ్లాయని తెలుస్తోంది. ఆ తర్వాత భూముల కొనుగోళ్లు, ఆక్రమణల్లోనూ అదే పేరు వినిపిస్తోంది. అధికారులు ఈ వ్యాపారి చైన్ లింకును పరిశీలిస్తేనే వాస్తవం తెలుస్తుందని స్థానిక గిరిజన పెద్దలు డిమాండ్ చేస్తున్నారు. కొంతమంది బాధితులు తమ వద్ద ఉన్న ఆధారాలను అధికారులకు అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

ఒక చేత్తో గిన్నెలు.. మరో చేత్తో ప్యాకేజీలు.. కాళ్ల కింద వేల ఎకరాలు..!

సాధారణ కొట్టుతో జీవనం ప్రారంభించిన వ్యాపారి కొద్ది కాలంలోనే భారీ ఆస్తులకు అధిపతి అయ్యాడన్నది మణుగూరులో చర్చనీయాంశంగా మారింది. సింగరేణి సర్వే సమయంలో తనకు సంబంధం లేని పేర్లను ప్యాకేజీ లిస్టులో చేర్పించారన్న ఆరోపణ బలంగా వినిపిస్తోంది. అదే సమయంలో చుట్టుపక్కల గ్రామాల్లో విస్తారంగా స్థలాలు తన అనుచరుల పేరిట కబ్జా చేసినట్లు తెలుస్తోంది. ఈ ఆస్తుల మూలం ఏమిటో విచారించాలని.. ఆదాయ వనరుల లెక్క తేల్చాలని గిరిజనులు కోరుతున్నారు. నిజమైన ఓసీ సర్వే లబ్ధిదారులకు న్యాయం చేయాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

సర్వేలో 50 ఫేక్ పేర్లు.. బినామీలతో వేల ఎకరాలు..!

సింగరేణి ఓసీ కోసం నిర్వహించిన సర్వేలో 50 నకిలీ పేర్లు ఈ వ్యాపారి హస్తంతో నమోదయ్యాయన్న ఫిర్యాదు ఇప్పుడు సంచలనంగా మారింది. నిజంగా అక్కడ నివాసం లేని వ్యక్తుల పేర్లు జాబితాలో చేరాయని కొందరు గని నిర్వాసితులు ఆరోపిస్తున్నారు. వారి వెనుక బినామీ వ్యవస్థ ఉందని.. ప్యాకేజీ సొమ్ము మరొకరి చేతికి వెళుతోందని తెలుస్తోంది. సర్వే రికార్డులు.. ఆధార్.. ఓటరు జాబితాలతో పోల్చి చూస్తే వాస్తవం బయటపడుతుందని వారు అంటున్నారు. తప్పుడు పేర్లను తొలగించి.. అర్హులకు మాత్రమే పరిహారం ఇవ్వాలని నిర్వాసితులు డిమాండ్ చేస్తున్నారు.

ఏజెన్సీని గుప్పిట్లో పెట్టుకున్న ఓ గిన్నెల వ్యాపారి..!

1/70 చట్టం అమలులో ఉన్న ఏజెన్సీలో.. గిరిజనేతరులకు భూమి బదిలీ నిషేధం ఉన్నా.. భారీగా స్థలాలు చేతులు మారాయన్న ఆరోపణ కలకలం రేపుతోంది. ప్రభుత్వ స్థలాలు.. గిరిజనులకు కేటాయించిన స్థలాలు.. అటవీ ప్రాంతాలు సైతం అన్యాక్రాంతమయ్యాయని ఫిర్యాదులు వస్తున్నాయి. రెవెన్యూ రికార్డుల్లో మార్పులు ఎలా జరిగాయో విచారించాలని గిరిజన సంఘాలు కోరుతున్నాయి. ఆక్రమణకు గురైన స్థలాలను గుర్తించి వెంటనే స్వాధీనం చేసుకోవాలని.. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నారు.

మొదటిపేజీ తరువాయి

వేటగాళ్లు, స్మగ్లర్లకు అడ్డాగా ములకలపల్లి అడవులు!

ములకలపల్లి, పాల్వంచ, పెనగడప, చంద్రుగొండ ఫారెస్ట్ రేంజ్‌ల పరిధిలో విస్తరించి ఉన్నాయి. మండల కేంద్రానికి సమీపంలోని కొన్ని అటవీ ప్రాంతాలు ఇతర రేంజ్‌ల పరిధిలో ఉండటంతో సంబంధిత కార్యాలయాలు దూరంగా ఉన్నాయి. క్షేత్రస్థాయి సిబ్బంది స్థానికంగా అందుబాటులో లేకపోవడం అక్రమార్కులకు అనుకూలంగా మారుతోందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

వేటగాళ్లు, స్మగ్లర్ల కన్ను అడవులపైనే!

మండలంలోని విస్తారమైన అటవీ ప్రాంతాలు ఐదు రేంజ్‌ల పరిధిలో విస్తరించి ఉండటంతో పర్యవేక్షణలో సమన్వయ లోపం కనిపిస్తోందనే విమర్శలు ఉన్నాయి. వివిధ రేంజ్‌ల పరిధిలో ఉన్న అటవీ ప్రాంతాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది స్థానికంగా అందుబాటులో లేకపోవడంతో వేటగాళ్లు, స్మగ్లర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాత్రి వేళల్లో తుపాకులతో అడవుల్లో సంచరిస్తూ జింకలు, అడవి పందులు తదితర వన్యప్రాణులను వేటాడుతున్నట్లు సమాచారం. తుపాకులు, విద్యుత్ తీగలు, ఉచ్చులు ఏర్పాటు చేసి వన్యప్రాణుల వేటకు పాల్పడుతున్న ఘటనలు గతంలోనూ వెలుగుచూశాయి. మరోవైపు అడవుల్లోని తునికి, వేప, బిల్లుడు వంటి విలువైన మారుజాతి వృక్షాలతోపాటు వెదురు కలపను నరికి ఆంధ్రప్రదేశ్ ప్రాంతానికి తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

బలవుతున్న వన్యప్రాణులు

ఇటీవల పాల్వంచ రేంజ్ పరిధిలోని మాధారం అటవీ ప్రాంతంలో వేటగాళ్లు ఏర్పాటు చేసిన ఉచ్చులో చిక్కుకుని జింక మృతి చెందిన ఘటన కలకలం రేపింది. అడవుల్లో ఉచ్చులు, విద్యుత్ తీగలు, నాటు తుపాకులతో వన్యప్రాణులను వేటాడుతున్న ఘటనలు గతంలోనూ వెలుగుచూశాయి. ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వన్యప్రాణుల సంరక్షణ కోసం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

మాయమవుతున్న భారీ వృక్షాలు

మోటుగూడెం, మొగరాలగుప్ప, గుండాలపాడు, చింతలపాడు తదితర గ్రామాల సమీపంలోని అటవీ ప్రాంతాల్లో భారీ వృక్షాలను నరికి విలువైన మారుజాతి కలపను అక్రమంగా తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఇదే ప్రాంతంలో తునికి మొద్దుల అక్రమ రవాణా ఘటన చోటుచేసుకోగా, తాజాగా బిల్లుడు, వేప, తునికి వృక్షాలను నరికి గుండాలపాడు మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని వెంకటాపురం ప్రాంతానికి తరలిస్తున్నట్లు స్థానికులు ఆరోపిస్తున్నారు. అలాగే చంద్రుగొండ రేంజ్ పరిధిలోని నల్లముడి అటవీ ప్రాంతం నుంచి వెదురు కర్రలను అక్రమంగా నరికి మాధారం, తిమ్మంపేట మీదుగా ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంత భారీ స్థాయిలో కలప అక్రమ రవాణా జరుగుతున్నా క్షేత్రస్థాయి సిబ్బందికి, ఫారెస్ట్ అధికారులకు తెలియకుండా ఉంటుందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. తమ పరిధిలో అక్రమాలు జరగలేదనే కారణంతో బాధ్యత నుంచి తప్పించుకుంటూ, సరిహద్దులు దాటి కలప తరలిస్తున్నా పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అటవీ శాఖ ఉన్నతాధికారులు స్పందించి అక్రమ వేట, కలప రవాణాపై నిఘా పెంచాలని, బాధ్యులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని, అడవులు, వన్యప్రాణులను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



మొదటిపేజీ తరువాయి

సంక్రాంతి నాటికి శ్రీరాంపురం చెరువుకు గోదావరి జలాలు!

శుక్రవారం గండుగులపల్లిలోని తన నివాసం నుంచి చీఫ్ ఇంజినీర్ (సీఈ) శ్రీనివాస్‌రెడ్డికి ఫోన్ చేసి కాలువ పనుల పురోగతిపై సమీక్షించారు. పెండింగ్ పనులన్నింటినీ డిసెంబరు నెలలోగా పూర్తి చేయాలని, పనులు పూర్తయిన వెంటనే చెరువుకు నీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. గోదావరి జలాలు చేరితే రైతులకు సాగునీటి వెసులుబాటు కలగడంతో పాటు చెరువులపై ఆధారపడిన వ్యవసాయానికి ప్రయోజనం చేకూరుతుందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలు, తుఫాను కారణంగా దమ్మపేట మండలంలోని పలు చెరువులకు గండ్లు పడిన నేపథ్యంలో వాటి పరిస్థితిపై ఆరా తీశారు. దెబ్బతిన్న చెరువులకు తక్షణమే మరమ్మతులు చేపట్టి నీటి నిల్వకు అనువుగా తీర్చిదిద్దాలని చీఫ్ ఇంజినీర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆలపాటి రామచంద్రప్రసాద్, పైడి వెంకటేశ్వరరావు, కొయ్యల అచ్యుతరావు, కాసాని నాగప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మొదటిపేజీ తరువాయి

శ్రీ కోదండ రామస్వామి ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన పాల్గొన్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు

భద్రాచలం, నవంబర్ 20 (ప్రజా జ్యోతి):

పట్టణంలోని శిల్పినగర్ ప్రాంతంలో శ్రీ కోదండ రామస్వామి దేవాలయ నూతన నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన మహోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి భద్రాచలం నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావుతో పాటు మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ, భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి దామోదర్, పట్టణ ప్రముఖులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు పాల్గొన్నారు. నూతన ఆలయ నిర్మాణ పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా త్వరితగతిన పూర్తికావాలని, శ్రీ కోదండ రామస్వామి దివ్య ఆశీస్సులు భక్తులందరిపై ఉండాలని ఈ సందర్భంగా ఆకాంక్షించారు. ఆలయ నిర్మాణ శంకుస్థాపన మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు.



తెల్లం శరత్‌కు న్యాయం చేయాలని కొవ్వొత్తుల నిరసన

నేడు భద్రాచలం పట్టణ బంద్‌కు పిలుపు...

బంద్‌కు రాజకీయ పార్టీలు, అఖిలపక్ష సంఘాల సంపూర్ణ మద్దతు

భద్రాచలం, నవంబర్ 20, (ప్రజా జ్యోతి) :



ఆదివాసీ యువకుడు తెల్లం శరత్ మృతి ఘటనకు నిరసనగా భద్రాచలం పట్టణంలో శాంతియుత నిరసన ర్యాలీ నిర్వహించారు. మృతుడు తెల్లం శరత్ చిత్రపటాన్ని చేతబూని, శ్రీ సత్యసాయి రెసిడెన్సీ ఎదుట కొవ్వొత్తులు వెలిగించి నివాళు లర్పిస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శరత్ మృతికి కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని నిరసనకారులు డిమాండ్ చేశారు.ఈ ఘటనపై ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతున్న నేపథ్యంలో న్యాయం కోసం నవంబర్ 21, శనివారం భద్రాచలం పట్టణ బంద్‌కు పిలుపునిచ్చారు. ఈ బంద్‌కు అన్ని రాజకీయ పార్టీలు, అఖిలపక్షాల నాయకులు, వివిధ ప్రజాసంఘాల ప్రతినిధులు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఆదివాసీ యువకుడి మృతికి న్యాయం జరిగే వరకు ఐక్యంగా పోరాడుతామని నాయకులు స్పష్టం చేశారు. బంద్‌ను విజయవంతం చేయడానికి వ్యాపార, వాణిజ్య సంస్థలు, విద్యాసంస్థలు, ప్రజలు స్వచ్ఛందంగా సహకరించాలని నిర్వాహకులు విజ్ఞప్తి చేశారు. పట్టణంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసు కోకుండా ప్రజలంతా శాంతియుతంగా నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. శరత్ మృతి ఘటనపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

దక్షిణ కొరియాలో స్టార్ హెల్త్ సీఈఓ అవార్డు అందుకున్న ఉప్పాడ రామ్ ప్రసాద్ రెడ్డి

అభినందనలు తెలిపిన పలువురు ప్రముఖులు

భద్రాచలం, నవంబర్ 20 (ప్రజా జ్యోతి):




భద్రాచలానికి చెందిన ప్రముఖ బీమా సలహాదారు ఉప్పాడ రామ్ ప్రసాద్ రెడ్డి అంతర్జాతీయ స్థాయిలో అరుదైన గుర్తింపు తెచ్చింది పొందారు. స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ సంస్థలో విశిష్ట సేవలు, వ్యాపారాభివృద్ధి, వినియోగ దారుల విశ్వాసాన్ని చూర గొన్నందుకు దక్షిణ కొరియాలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో సంస్థ సీఈఓ చేతుల మీదుగా ప్రతిష్టాత్మక సీఈఓ అవార్డును అందుకున్నారు. బీమా రంగంలో ఆరోగ్య భద్రతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ, అనేక కుటుంబాలకు ఆరోగ్య బీమా రక్షణ కల్పించడంలో ఆయన చేస్తున్న కృషికి ఈ అవార్డు గుర్తింపుగా నిలిచింది. అంతర్జాతీయ వేదికపై ఈ పురస్కారాన్ని అందుకోవడం ఆయన వృత్తిపరమైన ప్రస్థానంలో మరో మైలురాయిగా నిలిచింది.

పాల్వంచ లో ఫుట్‌పాత్ ఆక్రమణ

కొత్తగూడెం కలెక్టరేట్/పాల్వంచ, నవంబర్ 20, ప్రజాజ్యోతి:

చలికాలం ప్రారంభం కావడంతో స్వెటర్లు, దుప్పట్లు విక్రయించేందుకు పాల్వంచ పట్టణంలోని ఫుట్‌పాత్‌లపై తాత్కాలిక దుకాణాలు వెలిశాయి. ప్రజలకు అవసరమైన వస్తువులను అందుబాటులో ఉంచడం వరకు బాగానే ఉన్నా.. ఆ వ్యాపారాల నిర్వహణలో నిబంధనలు పాటిస్తున్నారా? ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహించేందుకు ఎవరు అనుమతించారు? తాత్కాలిక ట్రేడ్ లైసెన్స్ పేరుతో రూ.4 వేల చిల్లర రసీదు జారీ చేయడం వెనుక ఉన్న నిబంధనలు ఏమిటి? అన్న ప్రశ్నలు ఇప్పుడు పట్టణ ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి.



ఫుట్‌పాత్‌లు పాదచారుల సౌకర్యార్థం ఏర్పాటు చేసినవే తప్ప వ్యాపార సముదాయాలుగా మార్చేందుకు కాదన్న విషయం అధికారులకు తెలియదా? అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. తాత్కాలిక వ్యాపారాల నిర్వహణకు మున్సిపల్ అధికారులు అనుమతులు మంజూరు చేస్తే, వాటికి ఎలాంటి మార్గదర్శకాలు వర్తిస్తాయి? ఫుట్‌పాత్‌పై వ్యాపారం చేసేందుకు టెంపరరీ ట్రేడ్ లైసెన్స్ ఇవ్వడానికి నిబంధనలు అనుమతిస్తున్నాయా? అనుమతించినా ప్రజల రాకపోకలకు, వాహనాల రాక పోకలకు ఇబ్బందులు కలగకుండా ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే అంశాలపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది.

ఎంఆర్‌పీ ట్యాగులు ఏవీ.. ధరల నిర్ణయానికి ప్రాతిపదిక ఏమిటి?

ఫుట్‌పాత్‌పై ఏర్పాటు చేసిన దుకాణాల్లో విక్రయిస్తున్న స్వెటర్లు, దుప్పట్లపై ఎంఆర్‌పీ ధరల ట్యాగులు కనిపించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వ్యాపారులు చెబుతున్న ధరలు కూడా సామాన్యులను బెంబేలెత్తిస్తున్నాయి. ఒక్కో స్వెటర్‌ను రూ.2 వేల నుంచి రూ.4 వేల వరకు, ఒక్కో దుప్పటిని రూ.1,500 నుంచి రూ.5 వేల వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ధరల


మొదటిపేజీ తరువాయి



విషయంలో పారదర్శకత లేకపోవడంతో వినియోగదారులు అయోమయానికి గురవుతున్నారు. వస్తువులపై గరిష్ఠ చిల్లర ధరలు, తయారీదారు వివరాలు వంటి తప్పనిసరి సమాచారాన్ని ప్రదర్శిస్తున్నారా? లేదా? అన్నది సంబంధిత తూనికలు, కొలతల శాఖ అధికారులు పరిశీలించాల్సిన అవసరం ఉంది.

ఫుట్‌పాత్ ఆక్రమణ.. రోడ్డుపైకి వచ్చిన వాహనాలు!

ఫుట్‌పాత్‌లపై దుకాణాలు ఏర్పాటు చేయడంతో పాదచారులకు నడిచేందుకు దారి లేకుండా పోతోంది. స్వెటర్లు, దుప్పట్లు



కొనుగోలు చేసేందుకు వచ్చే ప్రజలు రహదారి పక్కనే వాహనాలను నిలిపివేస్తుం డటంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడు తోంది. ముఖ్యంగా జాతీయ రహదారిపై భారీ వాహనాల రాకపోకలకు ఈ తాత్కాలిక దుకాణాలు, వాటి వద్ద నిలిచే వాహనాలు అడ్డంకిగా మారుతున్నాయనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఏదైనా ప్రమాదం జరిగితే బాధ్యత ఎవరిది? ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాల్సిన పోలీసు యంత్రాంగం ఈ పరిస్థితిని ఎందుకు పట్టించుకోవడం లేదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

// మాదే రాజ్యం అన్నట్లుగా వ్యాపారుల రుబాబు ధందా //

స్థానికంగా ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న కొందరు వలస వ్యాపారుల తీరుపై ప్రజల్లో అసహనం వ్యక్తమవుతోంది. నిబంధనలను పక్కనపెట్టి తమ ఇష్టానుసారంగా దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాత్కాలిక అనుమతుల పేరుతో వ్యాపారాలకు అవకాశం కల్పించినా, వాటి పరిధి ఎంత? ఎక్కడ ఏర్పాటు చేసుకోవాలి? ఎంతకాలం నిర్వహించుకోవాలి? అనే అంశాలపై నియంత్రణ ఉందా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

// అధికారులు సమాధానం చెప్పాల్సిన ప్రశ్నలివే //

ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు నిర్వహిం చేందుకు టెంపరరీ ట్రేడ్ లైసెన్స్ మంజూరు చేయడానికి ఉన్న నిబంధనలు ఏమిటి? రూ.4 వేల చిల్లర రసీదు ఏ ప్రాతిపదికన జారీ చేశారు? ఆ రసీదుతో ఫుట్‌పాత్‌ను ఆక్రమించి వ్యాపారం చేసుకునే హక్కు కల్పించినట్లేనా? ఎంఆర్‌పీ ట్యాగులు లేకుండా వస్తువులు విక్రయిస్తున్న వ్యాపారులపై తనిఖీలు ఎందుకు నిర్వహించడం లేదు? జాతీయ రహదారిపై ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్నా మున్సిపల్, పోలీసు అధికారులు ఎందుకు స్పందించడం లేదు?

చలికాలం నేపథ్యంలో ప్రజలకు అవసరమైన వస్తువుల విక్రయాలను ప్రోత్సహించడంలో తప్పులేదు. కానీ ఆ పేరుతో ప్రజల నడక దారులను ఆక్రమించడం, రహదారులపై ట్రాఫిక్ సమస్యలు సృష్టించ డం, ధరల విషయంలో పారదర్శకత పాటించకపోవడం ఎంతవరకు సమంజసం? అన్నది పాల్వంచ ప్రజల ప్రశ్న. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు, పోలీసు యంత్రాంగం సంయుక్తంగా స్పందించి తాత్కాలిక వ్యాపారాలకు ఇచ్చిన అనుమతుల చట్టబద్ధతను పరిశీలించడంతో పాటు ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించి, వినియోగదారుల హక్కులను కాపాడాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ భూమి "ఆక్రమణకు" గురికాకుండా రక్షణ కల్పించాలి

సర్వే నంబర్ 111/5/1లోని ఎకరం 3 గుంటల భూమిపై కబ్జాదారులు కన్ను
భూమికి హద్దులు ఏర్పాటు చేయండి - తాసిల్దార్ కి వినతి పత్రం అందజేత







భద్రాచలం, నవంబర్ 20 (ప్రజా జ్యోతి):

పట్టణంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురికాకుండా తక్షణమే రక్షణ చర్యలు చేపట్టాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంఘాల ఐక్య వేదిక డిమాండ్ చేసింది. భద్రాచలం రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 111/5/1లో గల ఎకరం 3 గుంటల విలువైన ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ శుక్రవారం తహశీల్దార్‌కు ఐక్య వేదిక నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఐక్య వేదిక నాయకులు, సామాజిక ఉద్యమకారుడు అలవాల రాజా మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమానికి, భవిష్యత్తులో ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడాల్సిన ప్రభుత్వ భూమిని కొందరు అక్రమంగా ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఇప్పటికే సర్వే నంబర్ సూచించే బోర్డును తొలగించి, చెరువును పూడ్చివేయడంతో పాటు ముళ్లపొదలను తొలగించి, మట్టితో చదును చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తహశీల్దార్ తక్షణమే స్పందించి సంబంధిత భూమికి సర్వే నిర్వహించి హద్దులు నిర్ణయించాలని కోరారు. భూమి చుట్టూ కంచె ఏర్పాటు చేయడంతో పాటు ప్రభుత్వ భూమి అని తెలిపే హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఇల్లు, ఇంటి స్థలం లేని నిరుపేదల ప్రయోజనాల కోసం ఉపయోగపడాల్సిన ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. అధికారులు తక్షణమే స్పందించి చర్యలు తీసుకోకపోతే పేద ప్రజల తరపున ఆందోళన చేపట్టాల్సి వస్తుందని అలవాల రాజా మాదిగ హెచ్చరించారు.

ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా

ఇందిరమ్మ కుటుంబ "జీవిత బీమా" పథకం ప్రారంభం
కుటుంబ పెద్దకు ఆపద వస్తే అండగా నిలవడమే పథకం లక్ష్యం
భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు
డీఆర్‌డీఏ అధికారి విద్యాచందన, జెడ్పీ సీఈవో నాగలక్ష్మి

భద్రాచలం, నవంబర్ 20 (ప్రజా జ్యోతి):

ప్రతి ఇంటికి ఒక భరోసా.. ప్రతి కుటుంబానికి ఆర్థిక రక్షణ కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని భద్రాచలం నియోజకవర్గ శాసనసభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రారం భించారు. గురువారం భద్రాచలం పట్టణంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు.కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న వ్యక్తికి అనుకోని ప్రమాదం లేదా ఆపద సంభవించినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులకు గురికాకుండా జీవిత బీమా ద్వారా అండగా నిలవాలన్నది ఈ పథకం ప్రధాన ఉద్దేశమని ఎమ్మెల్యే తెలిపారు. కుటుంబ సభ్యులకు ఆర్థిక భద్రత, భరోసా కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ప్రతి కుటుంబం ఈ పథకం ద్వారా కల్పించే రక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో భద్రాచలం గ్రామపంచాయతీ సర్పంచ్ పూనెం కృష్ణ, డీఆర్‌డీఏ అధికారి విద్యాచందన, జెడ్పీ సీఈవో నాగలక్ష్మి, డీపీవో బొప్పన అనూష, గ్రామపంచాయతీ ఈవో శ్రీనివాస్, వార్డు సభ్యులు బొంబోతుల రాజీవ్, బొంత రమణ, బండారు శరత్‌బాబు, అబ్బినేని వినీలారాణి, కావూరి గోపి, నర్రా వాణి, నిట్ట రాజు, కారం దుర్గారావు, ఇలమల అశోక్, సున్నం భూలక్ష్మి, సున్నం ఈశ్వరమ్మ, జగ్గా కుమారి, ఇర్పా అనసూయ తదితరులు పాల్గొన్నారు.



ట్యాంక్ పై కథనాలు వస్తున్నా కదలని పబ్లిక్ హెల్త్ అధికారులు..!

- అధికారుల నిర్లక్ష్యం వల్ల వంగిన ట్యాంక్ కింద ప్రజల ప్రాణాలు..!
- బిల్లులు కాకముందే ఇంత నాసిరకమా..? ఇస్తే ఇంకేం చేస్తారో..!
- కాంట్రాక్టర్ బిల్లు ఆపి.. పనులను తనిఖీ చేయాలని స్థానికుల డిమాండ్..!

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా క్రైమ్ ప్రతినిధి / మణుగూరు, నవంబర్ 20, ప్రజాజ్యోతి...



మణుగూరు భగత్ సింగ్ నగర్ లో వంగిపోయిన నీటి ట్యాంక్ గురించి వారం రోజులుగా పేపర్ లో కథనాలు వస్తున్నా.. పబ్లిక్ హెల్త్ అధికారులు మాత్రం కదలడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2 కోట్ల 28 లక్షల ప్రజాధనంతో నిర్మిస్తున్న ట్యాంక్ పూర్తి కాకముందే ఒక పక్కకు వంగిపోయిందంటే.. నిర్మాణం ఎంత నాసిరకంగా జరిగిందో అర్థమవుతుందని వారు విమర్శిస్తున్నారు. కాంట్రాక్టర్ కు ఇంకా బిల్లులు కూడా కాలేదు.. అయినా అధికారులు పనులు ఆపి తనిఖీ చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బిల్లులు ఇచ్చే ముందే పూర్తి తనిఖీ చేసి.. నాసిరకం తేలితే బిల్లులు ఆపాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. పేపర్ లో వచ్చినా.. ఫోటోలతో సహా వార్తలు వచ్చినా.. పబ్లిక్ హెల్త్ అధికారులకు చీమ కుట్టినట్టు కూడా లేకపోవడం దేనికి సంకేతమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వారం రోజులుగా ఇదే ట్యాంక్ గురించి కథనాలు వస్తున్నా.. అయినా ఒక్క అధికారి కూడా స్పాట్ కు వచ్చి.. "ఏం జరుగుతోంది" అని కూడా అడగలేదని స్థానికులు ఆశ్చర్యపోతున్నారు. ట్యాంక్ చుట్టూ రోజూ వందల మంది ప్రజలు.. చిన్న పిల్లలు తిరుగుతున్నారు. వంగిన ట్యాంక్ ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి.. ఒకవేళ కూలితే.. ఆ ప్రాణనష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారు..? పేపర్ లో వచ్చిన తర్వాత కూడా పట్టించుకోని అధికారులే రేపు జరిగే నష్టానికి బాధ్యత వహించాలని స్థానికులు తేల్చి చెబుతున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకోవాలని.. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని భగత్ సింగ్ నగర్ స్థానికులు హెచ్చరిస్తున్నారు.

నలమాస కృష్ణ కుటుంబ సభ్యులను పరామర్శించిన విమలక్క

ఇల్లందు, నవంబర్ 20 (ప్రజా జ్యోతి)

ఉమ్మడి వరంగల్ - ఖమ్మం - నల్గొండ జిల్లాల పట్టభద్రుల (ఎమ్మెల్సీ) నియోజకవర్గం స్వతంత్ర అభ్యర్థి డా. నలమాస కృష్ణ గౌడ్ తల్లి నలమాస లక్ష్మి ఇటీవల మృతి చెందగా శుక్రవారం ప్రజా ఉద్య మాల పోరాట వనిత అరుణోదయ విమలక్క కుటుంబ సభ్య లను పరామర్శించారు. అనంతరం లక్ష్మి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎల్వైపిఎస్ రాష్ట్ర అధ్య క్షులు గుగులోత్ భీమా నాయక్, గిరిజన సామజిక చైతన్య వేదిక వ్యవస్థాపకులు కిషన్ నాయక్, డిఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు సూర్య ప్రకాష్, శివ వర్మ తదితరులు నలమాస లక్ష్మి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించి కుటుంబాన్ని పరామర్శించారు.



వేగానికి కళ్లెం వేయండి..

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి

నూతన తారు రహదారిపై పెరిగిన వాహనాల వేగం

ప్రమాదాలు జరగకముందే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని గ్రామస్థుల విజ్ఞప్తి

అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 20, (ప్రజా జ్యోతి):



అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన డబుల్ రోడ్డు పనులు పూర్తవడంతో గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గతంలో రహదారి సరిగా లేక ఎదురైన ఇబ్బందులకు కొత్త రహ దారి నిర్మాణంతో ఉప శమనం లభించిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అయితే నూత నంగా తారు రోడ్డు వేయడం తో వాహనాలు అధిక వేగంతో ప్రయాణి స్తుండటం ప్రజల్లో ఆందో ళన కలిగిస్తోంది. కొత్త రహ దారిపై బయట ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు 60 నుంచి 80 వేగంతో దూసుకెళ్తున్నాయని గ్రామస్థులు చెబుతున్నారు. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ప్రజలు, పాదచారులు, ద్విచక్ర వాహనదారులు నిత్యం రాకపోకలు సాగిస్తుండటంతో వేగంగా వెళ్లే వాహనాల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు.ఇప్పటికే పలుచోట్ల చిన్నపాటి ప్రమాదాలు తృటిలో తప్పిన ఘటనలు చోటుచేసుకున్నాయని, పెద్ద ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించాలని గ్రామస్థులు కోరుతున్నారు. రహదారిపై అవసరమైన ప్రాంతాల్లో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి వాహనాల వేగాన్ని నియంత్రించాలని, ప్రజల భద్రతకు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను విజ్ఞప్తి చేస్తున్నారు. కొత్త రహదారి ప్రజలకు సౌకర్యంగా ఉండటంతో పాటు ప్రమాదాలకు నిలయంగా మారకుండా అధికారులు తగిన చర్యలు చేపట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



ప్రతి కుటుంబానికి ఆర్థిక భరోసా కోసమే ఇందిరా గాంధీ కుటుంబ జీవిత బీమా పథకం

-అర్హులైన ప్రతి కుటుంబం ఇందిరా బీమా పథకంలో నమోదు చేసుకోవాలి: ఎమ్మెల్యే కోరం

ఇల్లందు, నవంబర్ 20 (ప్రజా జ్యోతి)



తెలంగాణ ప్రజా ప్రభుత్వం పేద, బడుగు, బలహీన వర్గాల కుటుంబాలకు అండగా నిలవాలనే సంకల్పంతో ఇందిరా గాంధీ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తికి అనుకోని ప్రమాదం సంభవించినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా భరోసా కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకంలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. స్వర్గీయ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా సిద్దిపేట వేదికగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించిన ఇందిరా గాంధీ కుటుంబ జీవిత బీమా పథకంలో భాగంగా శుక్రవారం ఇల్లందు మున్సిపల్ పరిధిలోని 1వ వార్డు సత్యనారాయణపురంలో నిర్వహించిన కార్యక్రమంలో నమోదు ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ప్రతి పేద కుటుంబానికి అండగా నిలవాలనే ఉద్దేశంతో రేషన్ కార్డు కలిగిన అర్హులైన కుటుంబాలకు కుటుంబ జీవిత బీమా సౌకర్యాన్ని కల్పిస్తుందన్నారు. దేశంలో పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం పేదలకు భరోసా కల్పిస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని బీమా పథకంలో నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర డానియల్, ఇల్లందు మార్కెట్ కమిటీ చైర్మన్ బానోత్ రాంబాబు, మున్సిపల్ కమిషనర్ సందీప్, వార్డు కౌన్సిలర్ షేక్ సైదుమీయా, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు భోళ్ల సూర్యం, మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు మడుగు సాంబమూర్తి, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాలుగో డివిజన్లో సమస్యలను పరిష్కరించాలని మేయర్ కు కార్పొరేటర్ వినతి

కొత్తగూడెం కలెక్టరేట్, పాల్వంచ/ నవంబర్ 20,(ప్రజా జ్యోతి)

పాల్వంచ కార్పొరేషన్ డివిజన్ పరిధిలోని నాలుగో డివిజన్ లో గత కాలం నుండి ప్రజల ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ డివిజన్ కార్పొరేటర్ చెరుకు భాగ్యలక్ష్మి శుక్రవారం కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ గణేష్ కు పలు సంస్థలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నాలుగో డివిజన్ లో ప్రధానంగా రోడ్లు ,డ్రైనేజీలు , వీధి దీపాలు వంటి సమస్యలను తక్షణమే చేపట్టాలని, అదేవిధంగా వేసవికాలంలో విద్యుత్ సమస్యలు లేకుండా చూడాలని కోరారు, ఈ ప్రాంతంలో విద్యుత్ సమస్య ప్రతి వేసవి కాలంలో వస్తున్నందున నాలుగవ డివిజన్ అయినా రాహుల్ గాంధీ నగర్ లో కొత్త ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయాలని, కేటీపీఎస్ కాలనీలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని, అదేవిధంగా భద్రాచలం రహదారిపై సి కాలనీ గేటు నుండి రెజీనా కాన్వెంట్ స్కూల్ వరకు ఉన్న వీధి దీపాలు వెంటనే పునరుద్ధరించాలని వినతి పత్రంలో కోరినట్లు తెలిపారు, ఇందుకు స్పందించిన మేయర్ దశలవారీగా రాహుల్ గాంధీ నగర్ లో సమస్యలన పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు ,




అర్హులైన ప్రతి కుటుంబానికి జీవిత బీమా భరోసా అందించడమే లక్ష్యం

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం దరఖాస్తుల స్వీకరణ

ఆళ్ళపల్లి.నవంబర్ 20(ప్రజాజ్యోతి)

మండల కేంద్రం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి సంబంధించి లబ్ధిదారుల నుంచి దరఖాస్తుల స్వీకరణ కార్యక్రమం కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆళ్ళపల్లి గ్రామ సర్పంచ్ వాసం సుష్మిత లబ్ధిదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించారు.ఈ పథకం ద్వారా అర్హులైన కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడంతో పాటు, కుటుంబ పెద్దను కోల్పోయిన సందర్భంలో ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వం అండగా నిలవాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరాలంటే ప్రజలు ముందుకు వచ్చి అవసరమైన పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుల స్వీకరణలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా సంబంధిత అధికారులను సంప్రదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఉమారాణి, ఎంపీడీవో ధీరవ శ్రీను, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వాసం శ్రీకాంత్, సీనియర్ నాయకులు మహమ్మద్ అతహర్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ కుటుంబ భీమా పథకం ప్రారంభం

మండలంలోని నాలుగు గ్రామ పంచాయతీల్లో 168 మంది లబ్ధిదారుల నామోదు

అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 20, (ప్రజా జ్యోతి):



అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో శుక్రవారం ఇందిరమ్మ కుటుంబ భీమా పథకం ప్రారంభమైంది. మండలంలోని నాలుగు గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 168 మంది లబ్ధిదారులు ఈ పథకంలో పేర్లు నమోదు చేసుకున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి నమోదు ప్రక్రియ ప్రారంభమైంది. మండలంలోని అన్నపురెడ్డిపల్లి గ్రామ పంచాయతీలో 44 మంది, మర్రిగూడెంలో 40 మంది, నర్సాపురంలో 61 మంది, పెదిరెడ్డిగూడెంలో 23 మంది ఈ పథకంలో పేర్లు నమోదు చేసుకున్నారు. మిగిలిన ప్రజలు కూడా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తమ గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలని ఎంపీడీవో రాజేశ్వరి సూచించారు.

జిల్లా లో ఘనంగా ప్రారంభమైన ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం రిజిస్ట్రేషన్ క్యాంపులు

-ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం-జిల్లా అదనపు కలెక్టర్ డి వేణుగోపాల్





కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 20 ,(ప్రజా జ్యోతి)

ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ శుక్రవారం నుంచి ప్రారంభమైంది. ఇందులో భాగంగా లక్ష్మీదేవిపల్లి మండలంలోని మొత్తం 31 గ్రామ పంచాయతీలకు గాను మొదటి విడతగా 11 గ్రామ పంచాయతీలలో ప్రత్యేక క్యాంపులు ఏర్పాటు చేసి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేపట్టారు. ఈ ప్రక్రియను శుక్రవారం అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ పరిశీలించారు.ఎంపిక చేసిన గ్రామ పంచాయతీల్లో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఎలాంటి ఇబ్బందులు, సమస్యలు లేకుండా ప్రశాంతంగా కొనసాగుతోంది అని తెలిపారు.

ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ డి. వేణుగోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి జీవిత బీమా భద్రత కల్పించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ లక్ష్య సాధనలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ, మున్సిపాలిటీల పరిధిలోని ప్రతి వార్డులో దశలవారీగా ప్రత్యేక క్యాంపులు నిర్వహించి నెల రోజుల వ్యవధిలో రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు . జిల్లాలోని అన్ని మండలాల్లో ఎంపిక చేసిన గ్రామాల్లో క్యాంపుల ద్వారా అర్హులైన కుటుంబాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తామని తెలిపారు.

ప్రస్తుతం రేషన్ కార్డు కలిగిన కుటుంబాలకు సంబంధించిన వివరాలను మాత్రమే ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు అవకాశం ఉందని, కుటుంబ సభ్యుల వివరాల నమోదుకు రేషన్ కార్డును తప్పనిసరిగా తీసుకురావాలని సూచించారు. రేషన్ కార్డు నంబర్ ఆధారంగా కుటుంబ సభ్యుల వివరాలను సేకరించి, కుటుంబంలో ఎవరి పేరుపై బీమా చేయించాలి, నామినీల వివరాలు, వారికి కేటాయించాల్సిన బీమా వాటాల శాతం తదితర వివరాలను నమోదు చేస్తారని తెలిపారు.

ఇప్పటికే రైతు బీమా, చేనేత బీమా, బీడీ కార్మికుల బీమా, భవన నిర్మాణ రంగ కార్మికుల బీమా వంటి ఇతర ప్రభుత్వ బీమా పథకాలు పొందుతున్న కుటుంబాలు సైతం ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకానికి దరఖాస్తు చేసుకోవచ్చని స్పష్టం చేశారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు సమర్పించే ముందు నమోదు చేసిన వివరాలన్నింటినీ లబ్ధిదారులకు పూర్తిగా చదివి వినిపించి, వారి అంగీకారం తీసుకున్న తర్వాతే దరఖాస్తును సమర్పిస్తామని తెలిపారు. రిజిస్ట్రేషన్ సమయంలో అందించిన మొబైల్ నంబర్‌కు దరఖాస్తు ఐడీ, సంబంధిత సమాచారం ఎస్ఎంఎస్ ద్వారా అందుతుందని వివరించారు.

క్యాంపుల్లో భౌతికంగా దరఖాస్తులు సమర్పించడం, రసీదులు జారీ చేయడం ఉండదని, క్యాంపు కౌంటర్ వద్ద ఏర్పాటు చేసిన రిజిస్టర్‌లో రేషన్ కార్డు వివరాలు, ట్రాన్సాక్షన్ ఐడీ, బీమా పొందే వ్యక్తి పేరు, నామినీ పేరు నమోదు చేసి దరఖాస్తుదారుడి సంతకం తీసుకుంటారని తెలిపారు. ప్రస్తుతం రేషన్ కార్డులు లేని కుటుంబాల వివరాల నమోదుకు ఆన్‌లైన్‌లో అవకాశం లేదని, ప్రభుత్వం నుంచి అవకాశం అందుబాటులోకి వచ్చిన వెంటనే వారి వివరాలను కూడా నమోదు చేస్తామని అన్నారు .

జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం రిజిస్ట్రేషన్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టామని, అర్హులైన ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ కోరారు. ప్రజలు తమ రేషన్ కార్డులతో సమీపంలోని క్యాంపులకు హాజరై రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు.

ఈ కార్యక్రమం అమలు తీరును పరిశీలించేందుకు జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి నాగలక్ష్మి, సీపీఓ సునీత , మండల ప్రత్యేక అధికారి బాబురావు పలు రిజిస్ట్రేషన్ క్యాంపులను సందర్శించి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, సూపర్‌వైజర్లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ జీవిత బీమా నమోదు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

డిప్యూటీ మేయర్ లలితకుమారి/ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు నూకల రంగారావు

కొత్తగూడెం కలెక్టరేట్ ,/పాల్వంచ /నవంబర్ 20,(ప్రజా జ్యోతి)

దివంగత మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ జీవిత భీమా నమోదు ప్రక్రియ శుక్రవారం పాల్వంచలోనీ పలు డివిజన్లలో ఘనంగా ప్రారంభమైంది, ఈ కార్యక్రమంలో భాగంగా పాల్వంచ పట్టణం 2వ బి 8వ డివిజన్లలో జరుగుతున్న ఇందిరమ్మ జీవిత భీమా నమోదు ప్రక్రియను టౌన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ నూకల రంగారావు, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, కార్పొరేటర్ భవిత కిరణ్ పరిశీలించారు. ఈ సందర్భంగా నమోదు ప్రక్రియ తీరును, ప్రజలకు అందుతున్న సేవలను వారు పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఇందిరమ్మ జీవిత బీమా ప్రక్రియను ప్రజలందరూ సదివినయం చేసుకోవాలని వారు కోరారు ,ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ విజయానంద్, మేనేజర్ సత్యనారాయణ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు



మైనారిటీ విద్యార్థులకు ఉచిత నైపుణ్య శిక్షణ. ఉపాధి అవకాశాలు

పలు కోర్సుల్లో శిక్షణకు ఆన్‌లైన్ దరఖాస్తుల ఆహ్వానం

ఈ నెల 24లోపు దరఖాస్తు చేసుకోవాలి

మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు -యాకూబ్ పాషా

కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 20 ,(ప్రజా జ్యోతి)



నిరుద్యోగ మైనారిటీ యువతకు నైపుణ్యాభివృద్ధి శిక్షణతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు తెలంగాణ మైనారిటీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో పలు ఉచిత శిక్షణ కోర్సులను అందిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర మైనారిటీ సంఘం అధ్యక్షుడు ఎండీ యాకూబ్ పాషా శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పదో తరగతి ఉత్తీర్ణులైన లేదా ఫెయిలైన వారికి ఎలక్ట్రిక్ వెహికల్ నైపుణ్య శిక్షణలో 60 సీట్లు, డిగ్రీ పూర్తి చేసిన వారికి సైబర్ సెక్యూరిటీలో 120 సీట్లు, బేసిక్ కంప్యూటర్ డేటా అనలిటిక్స్‌లో 60 సీట్లు, సైన్స్ విద్యార్హత కలిగిన వారికి మెడికల్ కోడింగ్, బిల్లింగ్‌లో 60 సీట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు.శిక్షణ పూర్తి చేసుకున్న వారికి స్టడీ సర్కిల్ ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ముస్లిం, క్రిస్టియన్, సిక్కు, జైన, బౌద్ధ, పార్శీ మైనారిటీ వర్గాలకు చెందిన అర్హులైన అభ్యర్థులు ఈ నెల 24వ తేదీలోపు https://షషష్.స్త్రఎంషషషష్.షశిఎ/ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 8520860785, 8919850920, 6305385949 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కుల మతాలకు ప్రతీకగా ఉర్సు ఉత్సవాలు

-24వ ఉర్సు ఉత్సవాల గోడ ప్రతులను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

ఇల్లందు, నవంబర్ 20 (ప్రజా జ్యోతి)



కుల మతాలకు ప్రతీకగా హజరత్ నాగుల్ మీరా మౌలా చాన్ దర్గాహ్ షరీఫ్ ఉర్సు ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శుక్రవారం స్థానిక సత్యనారాయణపురంలోని హజరత్ నాగుల్ మీరా మౌలా చాన్ దర్గాహ్ షరీఫ్ లో 24వ ఉర్సు ఉత్సవాల గోడ ప్రతులను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఏటా ఉర్సు ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడం సంతోషకరమని పేర్కొన్నారు. ఈ ఉర్సు ఉత్సవాలకు తెలంగాణ రాష్ట్రంతో పాటు వివిధ రాష్ట్రాల నుండి ప్రజలు అధిక సంఖ్యలో రావడం గొప్ప విషయన్నారు. ప్రశాంత వాతావరణంలో ఉర్సు ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం నిర్వాహకులు మాట్లాడుతూ డిసెంబర్ 7, 8 తేదీలలో నాగుల్ మీరా మౌలా చాన్ దర్గాహ్ షరీఫ్ 24 ఉర్సు ఉత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. డిసెంబర్ 7వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు నెంబర్ 2 బస్తీలో గల హజరత్ ఖాసిం దుల్హా దర్గాహ్ షరీఫ్ నుంచి చాదర్ తీసుకురావడం జరుగుతుందన్నారు. 7వ తేదీ సాయంత్రం 6 గంటలకు సందల్, 8వ తేదీ ఉదయం 8 గంటలకు నెంబర్ 2 బస్తీలో గల హజరత్ ఖాసిం దుల్హా దర్గాహ్ షరీఫ్ నుంచి జులూస్ బయలుదేరుతుందని, 8వ తేదీ మధ్యాహ్నం 12 గంటలకు దావతే హజరత్, సాయంత్రం 6 గంటలకు సలామీతో ఉర్సు ఉత్సవాలు ముగుస్తాయని పేర్కొన్నారు. ఈ ఉర్సు ఉత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, హజరత్ నాగుల్ మీరా మౌలా చాన్ దర్గాహ్ షరీఫ్ సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్య సూచికల్లో కొత్తగూడెం జిల్లా ముందంజ

- రాష్ట్ర కమిషనర్ ముషారఫ్ ఫరూకి ప్రశంసలు

ఐఎఫ్ఏ/ హెచ్ పి వి/ వ్యాక్సినేషన్ సికిల్ సెల్ ఇండికేటర్లలో కొరత లేకుండా చూడాలి

కొత్తగూడెం కలెక్టరేట్ ,నవంబర్ 20 ,(ప్రజా జ్యోతి)

జిల్లాలో ఐఎఫ్ పంపిణీ ,హెచ్ పి వి/ వ్యాక్సినేషన్, సికిల్ సెల్ ఇండికేటర్లలో కొరత లేకుండా చూడాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ముషారఫ్ ఫరూకి జిల్లా వైద్యాధికారు లను ఆదేశిం చారు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కార్యాలయంలో శు క్రవారం రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ కమిషనర్ నిర్వహించిన జూమ్ సమావేశంలో ఆయన మాట్లాడారు, రాష్ట్రంలోని 33 జిల్లాల వైద్య , ఆరోగ్యశాఖ అధికారులతో వివిధ ఆరోగ్య కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు ,ఈ సందర్భంగా జిల్లాల వారీగా ఆరోగ్య సూచికల పురోగతిని సమీక్షించగా, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఐఎఫ్ఏ పంపిణీ, హెచ్ పి వి వ్యాక్సినేషన్ , సికిల్ సెల్ ఇండికేటర్లలో మాత్రమే కొంత వెనుకబడి ఉన్నట్లు గుర్తించారు ,ఈ మూడు అంశాల్లో నిర్దేశించిన లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర కమిషనర్ సూచించారు.మిగిలిన అన్ని ఆరోగ్య సూచికల్లో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ముందంజలో ఉండటంపై రాష్ట్ర కమిషనర్ ప్రత్యేకంగా ప్రశంసించారు. ఇదే స్ఫూర్తితో మిగిలిన సూచికల్లో కూడా 100 శాతం లక్ష్యాలను సాధించాలని సూచించారు. అదేవిధంగా ఇకపై ప్రతి నెలలో రెండుసార్లు జూమ్ సమావేశాలు నిర్వహించి ఆరోగ్య కార్యక్రమాల పురోగతిని సమీక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ తుకారామ్ రాథోడ్ ,అడిషనల్ డి యం అండ్ హెచ్ ఓ డాక్టర్ సైదులు, డిప్యూటీ డి ఎం అండ్ హెచ్ ఓ భద్రాచలం డాక్టర్ శ్రీధర్, డిప్యూటీ డి ఎం ,హెచ్ ఓ కొత్తగూడెం డాక్టర్ ప్రతాప్ , ఎన్ సి డి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ దినేష్, టీ బి ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ప్రసాద్, ఎం. హెచ్.ఎన్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ రాకేష్, ఏ ఏ ఎం ఆఫీసర్ డాక్టర్ రాందాస్, ఏరియా ఆసుపత్రి భద్రాచలం డాక్టర్ రాధాకృష్ణ, ఏహో డాక్టర్ హరీష్ డిప్యూటీ డి ఈ ఎం ఓ నాగలక్ష్మి, ఎస్ ఓ నవీన్, టి హెచ్ యు బి కోఆర్డినేటర్ నిజాముద్దీన్, 102 కోఆర్డినేటర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.



అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట

గోదావరి వంతెన కింద కందకాలు తవ్వించిన పోలీసులు

బూర్గంపహాడ్,నవంబర్20 (ప్రజా జ్యోతి):

బూర్గంపహాడ్ మండలం సారపాక గోదావరి వంతెన కింద జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.ఇసుక తరలింపునకు వినియోగిస్తున్న మార్గాలను మూసివేసే ఉద్దేశంతో బూర్గంపాడు ఎస్ఐ మేడ ప్రసాద్ జేసీబీ సహాయంతో శుక్రవారం కందకాలు తవ్వించారు.వంతెన కింద నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఈ చర్యలు చేపట్టారు.అక్రమ రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందని,నిబంధనలు ఉల్లంఘించి ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.



బాలల హక్కుల పరిరక్షణతోనే బంగారు భవిష్యత్తుకు పునాది

జిల్లా సంక్షేమ అధికారిణి కే.ఎం.తార





కొత్తగూడెం కలెక్టరేట్, నవంబర్ 20 ,(ప్రజా జ్యోతి)

బాలలే దేశ భవిష్యత్తుకు నిజమైన సంపద ప్రతి బాలబాలికకు సురక్షితమైన బాల్యం, నాణ్య మైన విద్య, మెరుగైన ఆరోగ్యం, సమాన అవకాశాలు కల్పించినప్పుడే అభివృద్ధి చెందిన సమాజ నిర్మాణం సాధ్య మవుతుందని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి కే.ఎం.తార అన్నారు, అంతర్జా తీయ బాలల దినోత్సవం సంద ర్భంగా శుక్రవారం స్థానిక చుంచుపల్లి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్ర మంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బాలల హక్కుల పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములై బాలల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని పిలుపు నిచ్చారు. బాలలకు ప్రేమ, ఆప్యాయత, భద్రతతో కూడిన వాతా వరణాన్ని కల్పించడంతో పాటు వారి అభిప్రాయాలకు గౌరవం ఇవ్వడం, వారి ప్రతిభను గుర్తించి ప్రోత్స హించడం ఎంతో అవసరమని తెలిపారు. బాలలందరికీ విద్య అందుబాటులో ఉండాలని, పేదరికం, సామాజిక అసమానతలు, ఇతర కారణాల వల్ల ఏ ఒక్క బాలుడు కూడా విద్యకు దూరం కాకూడదని పేర్కొన్నారు. బాలల శారీరక, మానసిక ఎదుగుదలకు పౌష్టికాహారం, పరిశుభ్రత, వైద్య సేవలు, మానసిక ఆరోగ్య పరిరక్షణ ఎంతో కీలకమని వివరించారు. ముఖ్యంగా బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, బాలలపై లైంగిక వేధింపులు, హింస, నిర్లక్ష్యం, బాలల అక్రమ రవాణా వంటి సామాజిక దురాచారాలను పూర్తి స్థాయిలో నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహ రించాలని సూచించారు. బాలలపై ఎక్కడైనా హక్కుల ఉల్లంఘన జరిగినట్లు గుర్తిస్తే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువచ్చి వారికి తగిన రక్షణ, న్యాయం అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ అధికారి హరి కుమారి మహిళా సాధికారత సిబ్బంది సౌజన్య, షీటీం ఎస్ఐ రమాదేవి, డిసిపియు సిబ్బంది, చైల్డ్ హెల్ప్ లైన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దమ్మపేట సెంటర్ పేరు మార్పు పై వివిధ పార్టీల రాజకీయ నాయకుల ఖండన

పేర్లు మార్చడం కాదు,పాల్వంచ భవిష్యత్తును మార్చండి

చరిత్రగా నిలిచిన దమ్మపేట సెంటర్ పేరును కాపాడండి

కొత్తగూడెం కలెక్టరేట్ ,నవంబర్ 20 ,(ప్రజా జ్యోతి)

పాల్వంచ పట్టణంలో దమ్మపేట సెంటర్ పేరు మార్పు చేయాలనే ఆలోచన సరైనది కాదని పట్టణానికి చెందిన వివిధ పార్టీల రాజకీయ నాయకులు అన్నారు, పట్టణంలో దమ్మపేట సెంటర్ ను పేరు మార్చుతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్న సందర్భంగా పటంలోని వివిధ పార్టీల రాజకీయ నాయకులు మాట్లాడుతూ పాల్వంచ పట్టణం అభివృద్ధి చెందుతున్న క్రమం నుంచి,ఎన్నో దశాబ్దాలుగా ప్రజల నోళ్లలో నానుతూ,ప్రజల జీవితాలతో ముడిపడిపోయిన పేరు దమ్మపేట సెంటర్ అని అన్నారు, ఈ పేరు ఏ ఒక్క వ్యవస్థ పెట్టింది కాదు అనిఏ ఒక్క వ్యక్తి తన ప్రాభవాన్ని చాటు కోవడానికి పెట్టింది కాదు అనిఏ కులానికో,మతానికో, రాజకీయ పార్టీకో సంబంధించినది కానే కాదన్నారు, ఇది సహజంగా ప్రజల్లో పేరుగావించబడిందన్నారు, ప్రజల భావోద్వే గాలతో, అనుబంధాలతో,జీవన ప్రయాణంతో ముడిపడిన పేరు దమ్మపేట సెంటర్ అని అన్నారు, ఇంత పేరు ఉన్న దమ్మపేట సెంటర్ పేరును కేవలం అధికారంలో ఉన్నామనే కారణంతో, మన ముద్ర వేయాలనే ఉద్దేశంతో మార్చాలనుకోవడం ఎంతవరకు సమంజసం? అని ప్రశ్నించారు, ఇందిరమ్మపై అభిమానం ఉండవచ్చు. మరికొందరికి ఎన్టీఆర్‌పై అభిమానం ఉండవచ్చు. అది వారి వ్యక్తిగత అభిమానం.కానీ ప్రజలందరికీ సంబంధించిన ఒక ప్రాంతపు చిరకాల గుర్తింపును రాజకీయ అభిమానాలతో మార్చడం సరైన సంప్రదాయం కాదని అన్నారు, దమ్మపేట సెంటర్ అంటే కేవలం ఒక పేరు కాదు గుర్తింపు అని, ఇక్కడ చుట్టుపక్కల అనేక గ్రామాల ప్రజలకు జీవనోపాధికి, వ్యాపారాలకు, రాకపోకలకు,ఒక ప్రత్యేక చిరునామాగా నిలిచిన ప్రాంత మనీ, ఎన్టీఆర్ సెంటర్ అని కొందరు, ఇందిరమ్మ సెంటర్ అని మరికొందరుతమ అభిమానంతో పిలుచుకోవచ్చు.కానీ మనుగడలోకి రాదని, అధికారికంగా మాత్రం ప్రజలందరికీ పరిచయమైనదమ్మపేట సెంటర్ పేరును మార్చే ప్రయత్నం మాత్రం ఆమోదయోగ్యం కాదన్నారుబిమీ అధికారాన్ని పేరు మార్పులపై కాదు,ప్రజల సంక్షేమం పై చూపించాలని, అదేవిధంగాకుంటుపడిన పాల్వంచ పట్టణ అభివృద్ధిపై,8వ దశ పవర్ ప్లాంట్ సాధనపై,పట్టణంలోని ఎన్నో ఏళ్ల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలన్నారు, పాల్వంచ పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తే ప్రజలు హర్షించి ఆదరిస్తారన్నారు, పేరు మార్చడం అభివృద్ధి కాదని, ప్రజలకు ఉపయోగపడే మార్పు తీసుకురావడమే నిజమైన అభివృద్ధి అన్నారు, కావున ప్రజల మనోభావాలను గౌరవించి, దమ్మపేట సెంటర్ పేరు మార్పు ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని సంబంధిత అధికారులను, ప్రజాప్రతినిధులను పట్టణ ప్రజలు పలువురు డిమాండ్ చేశారు,

ప్రతి పేద కుటుంబానికి భీమా భరోసా కల్పించడమే లక్ష్యం

-ఇందిరమ్మ కుటుంబ భీమాపై గ్రామాల్లో అవగాహన కల్పించాలని పర్సా వెంకట్ పిలుపు

-అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేయాలి





అన్నపురెడ్డిపల్లి, నవంబర్ 20, (ప్రజా జ్యోతి):

అన్నపురెడ్డిపల్లి మండలంలోని పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించాలనే లక్ష్యంతో తెలంగాణ ప్రజా ప్రభు త్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ కుటుంబ భీమా పథకం ప్రయోజనాలను ప్రతి ఇంటికీ చేరవేయాలని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పర్సా వెంకట్ పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ అమలు చేస్తున్న పథకాల్లో ఇందిరమ్మ కుటుంబ భీమా ఒకటని తెలిపారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆది నారాయణ ఆదేశాల మేరకు మండలం లోని అన్ని గ్రామపంచాయతీలలో ఈ పథకం పై విస్తృత అవగాహన కల్పిం చాలని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు సూచిం చారు. పథకం ప్రయోజనాలు, అర్హతలు, దరఖాస్తు విధానం తదితర వివరాలను ప్రజలకు తెలియజేస్తూ అర్హులైన ప్రతి కుటుంబం ఈ పథకం ద్వారా లబ్ధి పొందేలా కృషి చేయాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రకటనలకే పరిమితం కాకుండా అర్హులైన ప్రతి కుటుంబానికి చేరినప్పుడే వాటి లక్ష్యం నెరవేరు తుందని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల మధ్య ఉంటూ సేవా కార్యక్రమాలను కొన సాగిం చాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ శ్రేణులు, గ్రామపంచాయతీ సర్పం చులు, ఉపసర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా.. ఇందిరమ్మ జీవిత బీమా

అంజనాపురంలో పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

అర్హులైన లబ్ధిదారులకు బీమా పత్రాల అందజేత

బూర్గంపహాడ్,నవంబర్20(ప్రజా జ్యోతి):

పేద కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తోందని పినపాక ఎమ్మెల్యే, శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు తెలిపారు.బూర్గంపహాడ్ మండలం అంజనాపురంలో నిర్వహించిన పథకం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.అర్హులైన లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించి,ప్రక్రియ పూర్తయిన వారికి బీమా పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుటుంబ పెద్దను కోల్పోయినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా అండగా నిలవాలన్నదే ఈ పథకం ఉద్దేశ మన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమం,అభివృద్ధికి సమాన ప్రాధాన్యమిస్తూ ప్రజా పాలన సాగిస్తోందని పేర్కొన్నారు.అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి, లబ్ధిదారుల వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విద్యాచందన, డీపీఓ అనూష,ఎంపీడీవో జమలారెడ్డి,తహసీల్దార్ ప్రసాద్,ఏపీఓ విజయలక్ష్మి, స్థానిక సర్పంచ్ బానోత్ నరసింహ,ఉప సర్పంచ్ సర్పంచ్ జయ,పంచాయతీ సెక్రెటరీ పురుషోత్తం,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,గ్రామ పెద్దలు,లబ్ధిదారులు పాల్గొన్నారు.



అయ్యప్ప దీక్ష మహిమాన్వితమైనది

-నిష్ఠ, నియమాలతో దీక్షను ఆచరిస్తే స్వామి ఆశీస్సులు

ఇల్లెందు, నవంబర్ 20 (ప్రజా జ్యోతి)

అయ్యప్ప దీక్ష ఎంతో మహిమాన్వితమైందని, భక్తిశ్రద్ధలతో నిష్ఠ, నియమాలను పాటిస్తూ దీక్షను ఆచరిస్తే అయ్యప్ప స్వామి ఆశీస్సులు ఎల్లవేళలా ఉంటాయని గురుస్వాములు ఏ టు జెడ్ శ్రీను, కోటి, కొండ శ్రీనివాస్, ధరావత్ వీరన్న లు అన్నారు. శుక్రవారం గురుస్వామి ఏ టు జెడ్ శ్రీను తన నివాసంలో అయ్యప్ప భక్తుల కోసం అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గురుస్వాములు మాట్లాడుతూ అయ్యప్ప దీక్ష కేవలం మాల ధరించడమే కాదని, అది ఆధ్యాత్మిక క్రమశిక్షణకు, ఆత్మనిగ్రహానికి ప్రతీక అని పేర్కొన్నారు. దీక్షా సమయంలో భక్తులు నియమ నిష్ఠలతో జీవిస్తూ, సత్యం, ధర్మం, శాంతి, సహనం వంటి సద్గు ణాలను అలవర్చుకోవాలని సూచించారు. స్వామి శరణు ఘోషతో భక్తిభావాన్ని పెంపొందించుకోవాలన్నారు. అయ్యప్ప స్వామి అనుగ్రహం కోసం మండల దీక్షను భక్తిశ్రద్ధలతో కొనసాగించాలని, తోటి భక్తుల పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండాలని తెలిపారు. అన్నదానం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఎంతో పుణ్యప్రదమని పేర్కొన్నారు. అనంతరం అయ్యప్ప భక్తులు పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.





పుష్కర ఘాట్ల పనులను వేగవంతం చేయాలి

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

అధికారులకు సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ ఆదేశం

భద్రాచలం, నవంబర్ 20 (ప్రజా జ్యోతి):

వచ్చే ఏడాది జరగనున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని భద్రాచలంలో నూతనంగా నిర్మిస్తున్న పుష్కర ఘాట్ల పనులను వేగవంతం చేసి, నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు.శుక్రవారం నీటిపారుదల శాఖ క్షేత్రస్థాయి ఇంజనీర్లతో కలిసి భద్రాచలంలో జరుగుతున్న పుష్కర ఘాట్ల నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలకు దేశ, విదేశాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు భద్రాచలానికి తరలివచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. శ్రీ సీతారామచంద్రస్వామి కొలువైన పుణ్యక్షేత్రం కావడంతో పుష్కర స్నానాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. భక్తుల సంఖ్యకు అను గుణంగా సరిపడా స్నాన ఘాట్లు అందుబాటులో ఉండేలా నిర్మాణ పనులు చేపట్టాలని సూచించారు. పనుల్లో నాణ్యత విషయంలో రాజీ పడకుండా ఇంజనీరింగ్ అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని, నిర్దేశించిన సమయంలోగా నిర్మాణాలను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో నీటిపారుదల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట

గోదావరి వంతెన కింద కందకాలు తవ్వించిన పోలీసులు

బూర్గంపహాడ్,నవంబర్20 (ప్రజా జ్యోతి):

బూర్గంపహాడ్ మండలం సారపాక గోదావరి వంతెన కింద జరుగుతున్న అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు.ఇసుక తరలింపునకు వినియోగిస్తున్న మార్గాలను మూసివేసే ఉద్దేశంతో బూర్గంపాడు ఎస్ఐ మేడ ప్రసాద్ జేసీబీ సహాయంతో శుక్రవారం కందకాలు తవ్వించారు.వంతెన కింద నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో ఈ చర్యలు చేపట్టారు.అక్రమ రవాణాపై నిరంతరం నిఘా కొనసాగుతుందని,నిబంధనలు ఉల్లంఘించి ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.



రైతుల సంక్షేమానికి ప్రాధాన్యమివ్వాలి

- మార్కెట్ అభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలి- నూతన పాలకవర్గానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు సూచన

బూర్గంపహాడ్, నవంబర్ 20 (ప్రజా జ్యోతి):



రైతుల సంక్షేమం,వ్యవసాయ రంగ అభివృద్ధే ధ్యేయంగా నూతన మార్కెట్ కమిటీ పాలకవర్గం బాధ్యతాయుతంగా పనిచేయాలని పినపాక ఎమ్మెల్యే,తెలంగాణ శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు సూచించారు.బూర్గంపహాడ్ మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో శుక్రవారం నిర్వహించిన నూతన మార్కెట్ కమిటీ పాలకవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా నూతన మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తోలెం కళ్యాణి,వైస్ చైర్మన్‌గా కాకా రాములు బాధ్యతలు స్వీకరించారు. నూతనంగా కొలువుదీరిన పాలకవర్గ సభ్యులకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించేలా కృషి చేయాలని సూచించారు.మార్కెట్ యార్డులో రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు, మార్కెట్ కార్యకలాపాలను పారదర్శకంగా,సమర్థవంతంగా నిర్వహించాలన్నారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.రైతుల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలని,మార్కెట్ అభివృద్ధికి నూతన పాలకవర్గం సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.రైతుల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా ముందుకు సాగాలని దిశానిర్దేశం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పూలపల్లి సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు భజన ప్రసాద్, మాజీ సొసైటీ చైర్మన్ పోతిరెడ్డి వెంకటేశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తెల్లం శరత్ మృతి ఘటనలో ఇద్దరు నిందితుల అరెస్ట్

లాడ్జి యజమాని, సిబ్బంది రిమాండ్‌కు తరలింపు

భద్రాచలం డీఎస్పీ అరుణ్ కుమార్



భద్రాచలం, నవంబర్ 20 (ప్రజా జ్యోతి): భద్రాచలం పట్టణంలోని సత్యసాయి లాడ్జి వద్ద గది కోసం వెళ్లిన యువకులపై దాడికి పాల్పడి, తెల్లం శరత్ బాబు మృతికి కారణమైన ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. లాడ్జి యజమాని ద్వార మణికంఠ, లాడ్జి బాయ్ బర్ల వినయ్‌లను శుక్రవారం అరెస్ట్ చేసి న్యాయస్థానంలో హాజరుపరచగా, న్యాయమూర్తి ఆదేశాల మేరకు రిమాండ్‌కు పంపినట్లు డీఎస్పీ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను పోలీసులు వెల్లడించారు. ఈ నెల 16వ తేదీన తెల్లం శరత్ బాబు స్నేహితులు, బంధువులైన కుర్సం నాగప్రశాంత్, కీసర కార్తీక్‌లు అతడిని కలిసేందుకు భద్రాచలం వచ్చారు. రాత్రి బస చేసేందుకు గది కోసం వెతుకుతూ రామాలయం సమీపంలోని సత్యసాయి లాడ్జికి రాత్రి 10 గంటల సమయంలో వెళ్లి గది కావాలని అడిగారు. ఈ క్రమంలో గది కేటాయింపు విషయంలో లాడ్జి యజమాని మణికంఠ, బాయ్ వినయ్‌లతో వాగ్వాదం చోటుచేసుకుంది. అనంతరం వారు ముగ్గురిపై దాడికి పాల్పడగా, తెల్లం శరత్ బాబు తీవ్రంగా గాయపడి రోడ్డుపై స్పృహ కోల్పోయి పడిపోయాడు. వెంటనే అతడిని భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

చర్లలో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు - ఏర్పాట్లను పరిశీలించిన డీఈఓ శంభు ప్రసాద్

చర్ల, నవంబర్ 20:(ప్రజాజ్యోతి):



చర్ల పోలీస్ గ్రౌండ్‌లో నవంబర్ 23 నుంచి 25వ తేదీ వరకు నిర్వహించనున్న ఎస్ జి ఎఫ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల ఏర్పాట్లను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా విద్యాశాఖాధికారి (డీఈఓ) శంభు ప్రసాద్ పరిశీలించారు. పోటీల నిర్వహణకు చేపడుతున్న ఏర్పాట్లపై సమీక్షించేందుకు ఆయన చర్లను సందర్శించారు. ఈ సందర్భంగా చర్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో పాల్గొని, పోటీలకు హాజరయ్యే క్రీడాకారులకు అవసరమైన వసతులు, మైదానాల సిద్ధం, క్రీడా సామగ్రి, వసతి, తాగునీరు, పారిశుద్ధ్యం, భద్రత తదితర అంశాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చే క్రీడాకారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వ యంతో ఏర్పాట్లు పూర్తి చేయాలని సూచించారు.పోటీల నిర్వహణకు చర్ల పోలీస్ శాఖ అందిస్తున్న సహకారం, ప్రత్యేక శ్రద్ధ పట్ల డీఈఓ శంభు ప్రసాద్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించి, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో మండల విద్యాశాఖాధికారి పి. వెంకటరమణ, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు హరిప్రసాద్, ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు పామర్తి శ్రీనివాసరావు, పి. శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా..

ఇందిరమ్మ జీవిత బీమా

అంజనాపురంలో పథకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

అర్హులైన లబ్ధిదారులకు బీమా పత్రాల అందజేత


బూర్గంపహాడ్,నవంబర్20(ప్రజా జ్యోతి):


పేద కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ జీవిత బీమా పథకాన్ని అమలు చేస్తోందని పినపాక ఎమ్మెల్యే, శాసనసభ ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్మన్ పాయం వెంకటేశ్వర్లు తెలిపారు.బూర్గంపహాడ్ మండలం అంజనాపురంలో నిర్వహించిన పథకం ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.అర్హులైన లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయించి,ప్రక్రియ పూర్తయిన వారికి బీమా పత్రాలను అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుటుంబ పెద్దను కోల్పోయినప్పుడు ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడకుండా అండగా నిలవాలన్నదే ఈ పథకం ఉద్దేశమన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమం,అభివృద్ధికి సమాన ప్రాధాన్యమిస్తూ ప్రజా పాలన సాగిస్తోందని పేర్కొన్నారు.అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించి,లబ్ధిదారుల వివరాలను ఎలాంటి పొరపాట్లు లేకుండా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.కార్యక్రమంలో అదనపు కలెక్టర్ విద్యాచందన,డీపీఓ అనూష,ఎంపీడీవో జమలారెడ్డి,తహసీల్దార్ ప్రసాద్,ఏపీఓ విజయలక్ష్మి, స్థానిక సర్పంచ్ బానోత్ నరసింహ,ఉప సర్పంచ్ సర్పంచ్ జయ,పంచాయతీ సెక్రెటరీ పురుషోత్తం,కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు,గ్రామ పెద్దలు,లబ్ధిదారులు పాల్గొన్నారు.



ఆపదలో ఉన్నవారికి అండగా పైడి వెంకటేశ్వరరావు

దమ్మపేట, నవంబర్ 20(ప్రజాజ్యోతి):





ఆపదలో ఉన్నవారికి అండగా నిలుస్తూ దమ్మపేట మాజీ జడ్పీటీసీ పైడి వెంకటేశ్వరరావు మరోసారి తన మానవత్వాన్ని చాటుకున్నారు. మండలం లోని గోపాలపురం సమీపం లో ఆటో బోల్తాపడిన ప్రమాదం లో అంకంపాలెం గ్రామా నికి చెందిన ఊకే చెల్లమ్మ తీవ్రంగా గాయపడ్డారు. చేతికి, కాలికి గాయా లైనట్లు సమాచారం అందుకున్న ఆయన వెంటనే దమ్మపేట ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని బాధితురాలికి వైద్యం అందేలా దగ్గరుండి పర్యవేక్షించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో సత్తుపల్లికి తరలించే ఏర్పాట్లు చేశారు. సత్తుపల్లి ఆసుపత్రి యాజమాన్యానికి ఫోన్ చేసి బాధితురాలికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ప్రమాద సమయంలో స్పందించి బాధితురాలికి వైద్యసాయం అందేలా చొరవ చూపడంపై స్థానికులు అభినందించారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాతో రూ.5 లక్షల భరోసా

-పథకంపై ప్రజలకు అవగాహన కల్పించిన అదనపు కలెక్టర్ వేణుగోపాల్

ఇల్లందు, నవంబర్ 20 (ప్రజా జ్యోతి)

అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా భరోసా కల్పించడమే ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం లక్ష్యమని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తెలిపారు. శుక్రవారం టేకులపల్లి మండలం కోయగూడెం గ్రామపంచాయతీ కార్యాలయంలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీమా ప్రీమియం మొత్తాన్ని లబ్ధిదారులు చెల్లించాల్సిన అవసరం లేదని, ప్రభుత్వమే పూర్తిగా భరిస్తుందని స్పష్టం చేశారు. పథకం అమలుకు నెల రోజుల గడువు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యక్రమంలో తహసీల్దార్ వీరభద్రం, ఎంపీడీవో శ్రీదేవి, ఎంపీఓ, ఉపసర్పంచ్ అనూష, కాంగ్రెస్ నాయకులు కోరం ఉమా--సురేందర్, గ్రామస్థులు పాల్గొన్నారు.



బాలల హక్కులపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరం

పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ దమ్మపేటలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం

దమ్మపేట, నవంబర్ 20(ప్రజాజ్యోతి):



బాలల విద్య, హక్కులు, రక్షణపై ప్రతి విద్యార్థికి అవగాహన ఉండాలని పీఎం శ్రీ జెడ్పీహెచ్ఎస్ దమ్మపేట ప్రధానోపాధ్యాయురాలు టీ. ఉషారాణి సూచించారు. శుక్రవారం దమ్మపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలల విద్యపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాలల హక్కులు, విద్య ప్రాముఖ్యత, బాలల రక్షణ, సమానత్వం తదితర అంశాలపై వివరించారు. ప్రతి బాలబాలికకు నాణ్యమైన విద్య పొందే హక్కు ఉందని, విద్యతోనే వ్యక్తిగత అభివృద్ధితో పాటు సమాజ పురోగతి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాల్యవివాహాల నివారణ, బాలలపై వేధింపుల అరికట్టడం, గుడ్ టచ్--బ్యాడ్ టచ్, వ్యక్తిగత భద్రత వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఎవరైనా ఇబ్బందులకు గురిచేస్తే భయపడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. అదేవిధంగా మొబైల్ ఫోన్లు, ఇంటర్నెట్ వినియోగంలో జాగ్రత్తలు పాటించాలని, సైబర్ వేధింపులు, ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. బాలబాలికల మధ్య వివక్ష చూపకుండా సమాన అవకాశాలు కల్పించాలని, విద్యార్థులు చదువుతోపాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాంబాబు, భాస్కరాచారి, కొండలరావు, సురేష్, కృష్ణారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగర్జన సభను విజయవంతం చేయండి

సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కెచ్చెల రంగారెడ్డి

ములకలపల్లి, నవంబర్ 20 (ప్రజాజ్యోతి):

డిసెంబర్ 29న హైదరాబాద్‌లో నిర్వహించనున్న 'ప్రజా గర్జన -- ళలో హైదరాబాద్' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కెచ్చెల రంగారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం రాచన్నగూడెంలో పోతుగంటి లక్ష్మణ్ అధ్యక్షతన నిర్వహించిన పార్టీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ ప్రభుత్వం ప్రజాస్వామిక హక్కులను కాలరాస్తూ దేశ సంపదను కార్పొరేట్ సంస్థలకు కట్టబెడుతోందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రజలు ఉద్యమించాలని కోరారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ పింఛన్లు, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలని, ఉపాధి హామీ పనులను 250 రోజులకు పెంచి రోజుకు రూ.700 వేతనం చెల్లించాలని కోరారు. కాంట్రాక్టు కార్మికులకు రూ.42 వేల కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కరువు సహాయక చర్యలు చేపట్టి, పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.25 వేల పరిహారం అందించాలని కోరారు. ఈ డిమాండ్ల సాధన కోసం హైదరాబాద్‌లో నిర్వహించే భారీ ప్రదర్శన, బహిరంగ సభకు కార్మికులు, రైతులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం, నాయిని రాజు, కెచ్చెల కల్పన, అమర్లపూడి రాము, నూపా భాస్కర్, గోకినేపల్లి ప్రభాకర్, జాటోత్ కృష్ణ, మధుసూదన్ రెడ్డి, ఈసం శంకర్, మాచర్ల సత్యం, పోతుగంటి లక్ష్మణ్, కల్లూరి కిషోర్, సర్పంచ్ మడకం విజయ, ఉప సర్పంచ్ పగ్గెల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ బీమాతో ప్రతి పేద కుటుంబానికి భరోసా

నాగుపల్లిలో తొలి ఆన్‌లైన్ నమోదు ప్రారంభించిన ఎమ్మెల్యే జారె

దమ్మపేట, నవంబర్ 20(ప్రజాజ్యోతి):

ఆపద సమయంలో పేద కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ కుటుంబ బీమా పథకాన్ని అర్హులైన ప్రతి కుటుంబానికి అందించాలని అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ అధికారులకు సూచించారు. దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించిన ఈ పథకంలో భాగంగా అశ్వారావుపేట నియోజకవర్గంలో తొలి నమోదు కార్యక్రమాన్ని దమ్మపేట మండలం నాగుపల్లి గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన చిలకా లక్ష్మీదేవి పేరుతో ఎమ్మెల్యే తొలి ఆన్‌లైన్ నమోదును స్వయంగా ప్రారంభించారు. అర్హులైన ప్రతి కుటుంబాన్ని గుర్తించి పథకంలో నమోదు చేయాలని, ఒక్కరు కూడా మిగిలిపోకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. పథకం ప్రయోజనాలపై ప్రజలకు అవగాహన కల్పించి నమోదు ప్రక్రియను పారదర్శకంగా, వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కక్కిరాల రమేష్, పీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దిశెట్టి సత్యప్రసాద్, ఎంపీడీవో రవీంద్రారెడ్డి, తహసీల్దార్ (ట్రైనీ డిప్యూటీ కలెక్టర్) మద్దినేని మురళి, ఏడీఈ రవికుమార్, స్థానిక సర్పంచి శ్రీనివాసరావు, కుంపటి వేణు తదితరులు పాల్గొన్నారు.



జీసీసీ బియ్యం నిల్వలు, రికార్డుల పరిశీలన..

రేషన్ బియ్యం పంపిణీలో పారపాట్లకు తావివ్వొద్దు

తహసీల్దార్ (ట్రైనీ డిప్యూటీ కలెక్టర్) మద్దినేని మురళి

దమ్మపేట, నవంబర్ 20(ప్రజాజ్యోతి):

మండల కేంద్రంలోని జీసీసీ ఎంఎల్ఎస్ పాయింట్‌ను దమ్మపేట తహసీల్దార్ (ట్రైనీ డిప్యూటీ కలెక్టర్) మద్దినేని మురళి గురువారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గోడౌన్‌లో ఉన్న బియ్యం నిల్వలను, సంబంధిత రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. నిరుపేదలకు అందించే బియ్యం సరఫరాలో ఎలాంటి పొరపాట్లకు తావివ్వకూడదని సిబ్బందికి సూచించారు. బియ్యం తూకాలు, కొలతల విషయంలో ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, నాణ్యతతో పాటు సరఫరా ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అందాల్సిన రేషన్ బియ్యం సక్రమంగా చేరేలా చూడాలని తెలిపారు. గోడౌన్‌లోని నిల్వలు, రికార్డుల నిర్వహణపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ తనిఖీలో డిప్యూటీ తహసీల్దార్ బద్రు, గోడౌన్ ఇన్‌చార్జి కొయ్యల పాంచాలి పాల్గొన్నారు.

